క్లుప్తంగా

విద్యార్థులకు బెల్టులు వచ్చేశాయ్..



ఎమ్మార్సీకి చేరిన బెల్టులు

యల్లనూరు: సర్కారు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాం బెల్టులు ఎమ్మార్సీకి వచ్చాయని ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వర రెడ్డి తెలిపారు. మొత్తం 1855 మంది విద్యార్థులకు బెల్టులు మంజూరయ్యాయి. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు బాలురు 654, బాలికలకు 604, అలాగే 6వ తరగతి నుంచి 8 వరతగతి వరకు 370, 9వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 227 మందికి బెల్టులు వచ్చాయన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైన వెంటనే అందిస్తామన్నారు.

అండర్-19 జిల్లా మహిళా క్రికెట్ జట్టుకు ఎంపిక



అండర్-19 జిల్లా జట్టుకు ఎంపికైన అమూల్య, నందిని

గుంతకల్లు: గుంతకల్లు ఆర్డీటీ క్రికెట్ శిబిరానికి చెందిన బట్నపాడు అమూల్య, బట్నపాడు నందిని (అక్కాచెల్లెలు) అండర్-19 మహిళ జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు ఆర్డీటీ కోచ్ ఇనయతుల్లా బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన ప్రాబబుల్స్ మ్యాచ్‌లో ఇద్దరు మంచి ప్రతిభ కనబరచి ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 7 నుంచి 12 వరకు వెంకటగిరిలో జరిగే అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఎంపికై న క్రీడాకారులు అమూల్య, నందినిని క్రికెట్ సంఘం మండల అధ్యక్షుడు ఆర్.హరినాథ్‌గౌడ్, సరోజని నాయుడు మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం సైరాబాను, పీఈటీ మంజువాణీ అభినందించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

ఆవు దాడిలో మహిళా రైతుకు గాయాలు



గాయపడిన మహిళా రైతు శివమ్మ

గుత్తి రూరల్: అబ్బేదొడ్డి గ్రామంలో బుధవారం ఆవు దాడిలో ఓ మహిళా రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన శివమ్మ తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా ఆవు బెదిరి ఆమెపై దాడి చేసింది. గమనించిన తోటి కూలీలు అపస్మారక స్థితిలో పడి ఉన్న శివమ్మను గమనించి 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు విచారణ చేపట్టారు.

తహసీల్దార్ కారు బోల్తా

- సురక్షితంగా బయటపడిన డ్రైవర్



బోల్తా పడిన కారు

శింగనమల: బుక్కరాయసముద్రం సమీపంలోని అనంత విద్యానికేతన్ వద్ద కారుఅదుపు తప్పి బోల్తా పడింది. వివరాలు..శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మోహన్‌బాబును వదిలి, పని మీద డ్రైవరు మాత్సుపాల్ కారు తీసుకెళ్లారు. పని ముగించుకొని అనంతపురం నుంచి వస్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదంలో డ్రైవరుకు ఎటువంటి గాయాలు కాలేదు. కారు మాత్రం దెబ్బతింది.

మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ రాజీనామా



సునీలా యాదవ్

గుత్తి: గుత్తి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ పదవికి చెవులు సునీలా యాదవ్ బుధవారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖను కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ శాఖకు పంపారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల్లో ఓడిపోవడంతో రాజీనామా చేస్తున్నట్లు సునీలా యాదవ్ చెప్పారు. తన రాజీనామాను ఆమోదించాలని లేఖలో కోరారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



గుత్తి గేట్స్ కాలేజీలో మొక్కలు నాటుతున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు,ఫారెస్టు అధికారులు



గుత్తి ఏడీజే కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు

గుత్తి: పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా భావించాలని ఏడీజే శ్రీహరి పేర్కొన్నారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నారపరెడ్డి ఆధ్వర్యంలో ఏడీజే కోర్టు ఆవరణలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీజే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాలన్నారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి హాని కలుగుతుందని ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయమూర్తి కాశీవిశ్వనాథ్ ఆచారి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పీడీ రత్నం, ఏపీపీ బుసా సుధీర్‌రెడ్డి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గేట్స్ కాలేజీ ఆధ్వర్యంలో..

గేట్స్ కాలేజీ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మొక్కలు నాటడంతోపాటు వాటిని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో గేట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సురయ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పర్యావరణాన్ని కాపాడితే అది మనల్ని రక్షిస్తుందని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాజేశ్వరి అన్నారు. బుధవారం కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో 100 మొక్కలను నాటారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించి భావితరాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్ శర్మ, సూపరింటెండెంట్ మల్లికార్జున, సీనియర్ అసిస్టెంట్ నందకుమార్ వర్మ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

యల్లనూరు: మొక్కలను విరివిగా పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎల్లుట్ల ఎఫ్‌బీఓ రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా కూచివారిపల్లి గ్రామ సమీపంలోని కాటం శివాలయం వద్ద కొండప్రాంతంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఎఫ్‌బీఓ మాట్లాడుతూ ఆక్సిజన్ కావాలంటే మొక్కలు విరివిగా నాటాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై గ్రామస్తులకు ఆయన అవగాహన కల్పించారు. రైతుల వ్యవసాయ పొలాల్లో నాటుకునేందుకు 80 మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పుట్లూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ఎంఈఓలు శ్రీదేవి, ప్రేమ్‌కుమార్, జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఉపాధి హామీ సిబ్బంది ఆదర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, చెట్లను విరివిగా పెంచాలని నినాదాలు చేశారు. అనంతరం పర్యావరణ కాలుష్యం వల్ల కలిగే నష్టాలను వివరించడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు.

బుక్కరాయసముద్రం: ప్రతి ఒక్కరూ చెట్లును నాటాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సీడీపీఓ ఉమా శంకరమ్మ పేర్కొన్నారు. బుధవారం రెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రోజురోజుకు కాలుష్యం పెరిగిపోతోందన్నారు. దీంతో మానవ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. వాతావరణం కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అన్నపూర్ణ, నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

గార్లదిన్నె: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎఫ్‌బీఓ జగదీష్ పేర్కొన్నారు. బుధవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోటంక గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలతోనే మానవ మనుగడ ముడిపడి ఉందన్నారు. వర్షకాలం కావడంతో మొక్కలు నాటి పెంచాలన్నారు. ఈసందర్భంగా ఆలయం వద్ద 150 మొక్కలు నాటినట్లు తెలిపారు.

పెద్దవడుగూరు: ప్రజలందరూ పర్యావరణాన్ని రక్షించుకోవడానికి కృషి చేయాలని ఏపీఓ పుల్లారెడ్డి పేర్కొన్నారు. బుధవారం చింతలచెరువు గ్రామంలో అమృత్ సరోవర్ పని ప్రదేశంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలు నాటడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈసీ విజయ్‌కుమార్, టీఏ రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నారాయణమ్మ, రామలక్ష్మమ్మ పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని అంగన్‌వాడీసెంటర్ల వద్ద మొక్కలు నాటారు. ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రతపై సిబ్బందికి వారు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

గుంతకల్లు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సీనియర్ డీసీఎం మనోజ్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా స్థానిక రెస్ట్ రూమ్ ఆవరణలో టికెట్ చెకింగ్ స్టాఫ్ ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతోపాటు దాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిక్కెట్ చెకింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.



గార్లదిన్నె మండలం కోటంక ఆంజనేయస్వామి ఆలయం వద్ద మొక్కలు నాటుతున్న దృశ్యం



పెద్దవడుగూరు మండలం చింతలచెరువు లో మొక్కలు నాటుతున్న ఉపాధిహామీ సిబ్బంది



పెద్దపప్పూరులో మొక్కలు నాటుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు



మహిళలతో మొక్కలు నాటిస్తున్న ఎఫ్‌బీఓ రవిచంద్రారెడ్డి



పుట్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాజేశ్వరి



బీకేఎస్ మండలం రెడ్డిపల్లి పాఠశాలలో మొక్క నాటి నీరు పోస్తున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

'నీట్'లో మెరిసిన గుత్తి అమ్మాయి



రిషిత రవి త్రయిని

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని చెర్లోపల్లికి చెందిన రిషిత రవి త్రయిని నీట్ పరీక్షా ఫలితాల్లో సత్తా చాటింది. మొత్తం 720 మార్కులకు గాను 690 మార్కులు సాధించింది. చెర్లోపల్లికి చెందిన రాధిక(స్కూల్ అసిస్టెంట్), రవి (స్కూల్ అసిస్టెంట్) దంపతుల కుమార్తె రిషిత రవి త్రయిని గుత్తి ఆర్ఎస్‌లోని సెయింట్ మేరీస్ పాఠశాలలో టెన్త్ వరకు చదివింది. టెన్త్‌లో మండల టాపర్‌గా నిలిచింది. అనంతరం ఇంటర్ బెంగళూరులోని ఎలైట్ కాలేజీలో చదివింది. నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించింది.

రజాపురం సొసైటీ అధ్యక్షుడి రాజీనామా



ఎంసీ.నాగరాజు

గుత్తి రూరల్: రజాపురం సహకార పరపతి సంఘం అధ్యక్షుడు ఎంసీ.నాగరాజు తన పదవికి రాజీనామా చేశారు. బుధవారం రాజీనామా లేఖను గుత్తి డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎంసీ.నాగరాజు మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి చెందడంతో మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు రాజీనామా చేస్తున్నానన్నారు. వెంటనే తన రాజీనామాను ఆమోదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు విరామ బైబిల్ పాఠశాల ప్రారంభం

పామిడి: పట్టణ సీఎస్ఐ చర్చిలో గురువారం నుంచి ఈనెల 9వ తేదీ వరకూ నిర్వహించే విరామ బైబిల్ పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలని చర్చి పాస్టర్ రెవరెండ్ బీవీ విశ్వమోహన్ బుధవారం కోరారు. చిన్ననాటి నుంచే పిల్లల్లో దైవత్వాన్ని పెంపొందించి వారిని సన్మార్గంలో పయనింప జేయడానికి విరామ బైబిల్‌స్కూల్ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఒకటవ తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న మండలవ్యాప్తంగా గల క్రైస్తవ, క్రైస్తవేతర విశ్వాసుల పిల్లలు అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఎస్ఆర్ఐటీ అధ్యాపకునికి డాక్టరేట్



భార్గవరెడ్డిని అభినందిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సిబ్బల భార్గవరెడ్డి గౌరవ డాక్టరేట్ అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ పేర్కొన్నారు. ప్రొఫెసర్ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో ఇంటెలిజెంట్ అల్గారిథమ్ బేస్డ్ ఏసీటీ ఎన్హ్వాన్మెంట్ ఇన్‌స్ట్రక్టర్ పవర్ సిస్టం అనే అంశంపై పరిశోధన చేసినందుకు అన్నామలై విశ్వవిద్యాలయం భార్గవరెడ్డికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. భార్గవరెడ్డిని కళాశాల కరెస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, టీపీఓ రంజిత్‌రెడ్డి, శ్రీనివాసులు, మేరిమాత అభినందించారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు

గార్లదిన్నె: గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మహమ్మద్ గౌస్ హెచ్చరించారు. బుధవారం ఎస్ఐ పలు గ్రామాల్లో పర్యటించారు.ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వెలువడడంతో గెలుపు ర్యాలీలకు అనుమతులు లేవన్నారు. ఎవరైనా హింసాత్మక ఘటనలు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

సర్పంచ్ ఫిర్యాదుపై విచారణ

వజ్రకరూరు: మండల పరిధిలోని గడేహోతురులో మంగళవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు వాటర్‌ప్లాంట్ తాళాలు పగులగొట్టిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సర్పంచ్ కె.సురేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం సిబ్బందితో కలిసి ఎస్ఐ నరేష్ గడేహోతురులో పర్యటించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ సురేంద్ర మాట్లాడుతూ.. మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు వాటర్‌ప్లాంట్ తాళాలు పగులగొట్టారు. అనంతరం వాటర్‌ప్లాంట్‌కు కొత్త తాళాలు వేసి తీసుకెళ్లినట్లు పోలీసులకు వివరించారు. గత కొన్ని సంవత్సరాలుగా వాటర్‌ప్లాంట్‌ను పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాటర్ ప్లాంట్‌కు తాళాలు వేయడంతో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.

జీవితాంతం జగనన్న వెంటే నడుస్తాం



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుక్కరాయసముద్రం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట జీవితాంతం నడుస్తామని ఆ పార్టీ నాయకులు రామకృష్ణారెడ్డి, రామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నీలారెడ్డిపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి గుమ్మడికాయ దిష్టితీసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న పరిపాలనలో కోట్లాది మందికి కుల,మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. పేదలకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించారన్నారు. ప్రజల తీర్పును శిరసావహిస్తామన్నారు. ఇక నుంచి జగనన్న బాటలో ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీపీఎంఓ రవిశంకర్

బొమ్మనహాళ్: ప్రభుత్వాస్పత్రిలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డీపీఎంఓ రవి శంకర్ తెలిపారు. బుధవారం మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో స్థానిక ప్రజాఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. ఇంటింటి సర్వే సక్రమంగా నిర్వహించి ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితులను నమోదు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. గోవిందవాడలో గర్భిణీ మృతికి గల కారణాలను మృతురాలి రికార్డు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణీ రఫీయా సుల్తానా, సిబ్బంది పాల్గొన్నారు.

టెంకాయ చెట్టుపై పిడుగు



టెంకాయచెట్టు నుంచి ఎగసిపడుతున్న మంటలు

యల్లనూరు: చింతకాయమంద గ్రామంలో ఓ ఇంటి వద్దనున్న చెట్టుపై పడింది. వివరాలు.. బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈక్రమంలో గ్రామానికి చెందిన ముస్తీస్‌వలి(నన్నె) ఇంటి వద్ద ఉన్న టెంకాయ చెట్టు రాత్రి 10 గంటల సమయంలో పిడుగు పడింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

కూడేరులో మోస్తరు వర్షం

కూడేరు: మండలంలో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులుతో మోస్తరు వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులకు ఊరటనిస్తున్నాయి. పంటల సాగుపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోంది. పంటలు సాగు చేసేందుకు రైతులు ధైర్యంగా ముందుకొస్తున్నారు. ఈనెల 15 నుంచి వేరుశనగ విత్తనం విత్తుకోవడానికి అదును కాలం. వర్షాలు బాగా కురుస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం ఏడు గంటలకు ప్రారంభమైన వర్షం అరగంటకు పైగా కురిసింది. వర్షపు నీరు కాలనీల నుంచి మెయిన్ రోడ్డు మీదుగా చెట్టుకుంట వైపు ప్రవహించాయి. ఇటీవల విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో భూగర్భ జలాలు పెరగనున్నట్లు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభం కావడంతో రైతులు వేరుశనగతో పాటు ఆముదం , కంది సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

పరామర్శ



చికిత్స పొందుతున్న మంగళమ్మను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజినేయులు

బొమ్మనహాళ్: టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడి బళ్లారిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ తల్లి మంగళమ్మను బుధవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజినేయులు పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో టీడీపీ విజయం సాధించడంతో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయి దౌర్జన్యంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇంట్లోకి దూరి మహిళపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ఆయన వెంట నాయకులు రామకృష్ణ, అనీల్‌రెడ్డి తదితరులున్నారు.

ఇన్‌చార్జ్ ఎస్ఐగా గౌస్‌బాషా

పెద్దపప్పూరు: పెద్దపప్పూరు ఇన్‌చార్జ్ ఎస్ఐగా తాడిపత్రి టౌన్ ఎస్ఐ గౌస్ బాషా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ శరత్‌చంద్ర పనితీరు సరిగా లేకపోవడంతో మూడురోజుల క్రితం జిల్లా అధికారులు సస్పెండ్ చేశారు. అనంతరం సమస్యాత్మక గ్రామాల్లో అయన పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంత జీవనం సాగించాలని ఆయన వారికి సూచించారు.

రెచ్చగొట్టే చర్యలకు దిగొద్దు



పెద్దవడుగూరులో పర్యటిస్తున్న పోలీసులు

పెద్దవడుగూరు: గ్రామాల్లో ఇతరులను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడొద్దని ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. పెద్దవడుగూరు , మిడుతూరు, చిన్నవడుగూరులో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడారు. ప్రజలు అందరూ ప్రశాంతంగా జీవించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికోడ్ అమల్లో ఉందని, ఉల్లఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా పోస్టులు పెట్టినా ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తాడిపత్రి అర్బన్: నందలపాడులోని ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో ప్రవేశానికి ఈనెల 12 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లావణ్య బుధవారం ఓ ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 13న ఉదయం 10 గంటలకు మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ఎంపిక మెరిట్, రోస్టర్ ఆధారంగా జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాయదుర్గంలో నోటాకు 2,370 ఓట్లు

రాయదుర్గంటౌన్: ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో రాయదుర్గం నియోజకవర్గంలో మొత్తం 13 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 41,659 ఓట్ల మెజార్టీతో రాయదుర్గం ఎమ్మెల్యేగా కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు గెలుపొందిన విషయం తెలిసిందే. నియోజకవర్గంలో 296 పోలింగ్ బూత్‌లకుగాను మొత్తం 2,64,248 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,27,248 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో 2,370 మంది ఓటర్లు నోటాకు ఓటేయడం విశేషం.

భూసార ఫలితాల ఆధారంగా పంటల సాగు

కుందుర్పి: మట్టి నమూనాల ఫలితాల ఆధారంగా రైతులు ఖరీఫ్‌లో పంటలు సాగు చేయాలని వ్యవసాయ అధికారి మహేష్ సూచించారు. బుధవారం కుందుర్పిలో రైతులకు నట్టినమూనాలపై రైతులకు అవగాహన కార్యక్రమం కల్పించడంతో పాటు రైతులకు ఖరీఫ్ పంటల సాగుపై సూచనలు సలహాలు అందజేశారు. మండల వ్యాప్తంగా 2,200 క్వింటాళ్ల వేరుశనగ విత్తనం అందజేశామన్నారు. అంతర పంటలుగా ఉలువ, అలసంద, కంది, ఆముదం వంటి పంటలను సాగు చేస్తే వేరుశనగకు సోకే చీడపీడలను కొద్దిమేర నివారించవచ్చాను. ఇప్పటికే బోరుబావుల కింద రైతులు 198 ఎకరాల్లో వేరుశనగ సాగు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.